www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY

సంపుటి: 01 | సంచిక: 95 | హైదరాబాద్ | సోమవారం | 23-06-2025 | పేజీలు: 04 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు

## యూపీఏ హయాంలో రిమోట్ కంట్రోల్ ప్రభుత్వం



**సిద్దిపేట పవర్, తెలంగాణ బ్యూరో:**

యూపీఏ హయాంలో రిమోట్ కంట్రోల్ ప్రభుత్వం ఉండేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సికింద్రాబాద్‌లో ఎంపీ ఈటల రాజేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత భారత్ సంకల్ప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోదీ నేతృత్వంలో అద్భుత, సమర్థవంతమైన పరిపాలన అందిస్తున్నామన్నారు. ప్రజల ఆకాంక్షలు, ఆశలకు అనుగుణంగా భాజపా పాలిస్తోందని చెప్పారు.

"కాంగ్రెస్ హయాంలో ఎక్కడ చూసిన అవినీతి వార్తలే. దేశంలో అవినీతి ప్రభుత్వం ఉండవద్దని 2014లో భాజపాని అద్భుత మెజార్టీతో గెలిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పాకిస్థాన్ ఆడిందే ఆట.. పాడిందే పాటగా ఉండేది. దేశంలోని పలు ప్రాంతాలను ఉగ్రవాదులు నాశనం చేశారు. హైదరాబాద్‌లోనూ పాక్ ఉగ్రవాదులు రక్తపాతం సృష్టించారు. ఉగ్రవాద కార్యకలాపాలు జరిగినా.. ఏం చేయలేని నిస్సహాయ పరిస్థితుల్లో కాంగ్రెస్ ఉండేది. ప్రస్తుతం ప్రధాని మోదీ నేతృత్వంలో పాక్ దాడులకు గట్టిగా బదులిచ్చాం. ప్రపంచ దేశాలు నివ్వెరపోయేలా గట్టి జవాబు ఇచ్చాం" అని కిషన్‌రెడ్డి అన్నారు.

## ఆర్టీసీ కార్మికులకు ఎలక్ట్రిక్ షాక్

రోడ్డున పడనున్న 10 వేలమంది ఉద్యోగులు, కార్మికులు?

టీజీఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్‌ల రాకతో ఉద్యోగాలకు ముప్పు

కేంద్రం అసంబద్ధ పథకం...

రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం

అనుభవంలేని డ్రైవర్లతో సురక్షిత ప్రయాణం ప్రశ్నార్థకం

ప్రభుత్వాల తీరుపై కార్మిక సంఘాల నేతల మండిపాటు



2

# రైతు భరోసా నిధుల పంపిణీలో రికార్డు..

## కేవలం 6 రోజుల్లో రూ. 7700 కోట్లు..!

### 16వ తేదీన రైతు నేస్తం వేదిక పంపిణీ షురూ..


3



## "చర్చలు జరిపేదే లేదు.. ఆయుధాలు విడిచి లొంగిపోండి.."

మావోయిస్టులకు వరుసగా ఎదురుదెబ్బలు

కేంద్ర హోంమంత్రి సంచలన వ్యాఖ్యలు

మావోలతో ఎలాంటి చర్చలు జరిపేదే లేదు

ఆయుధాలు విడిచి జనజీవన స్రవంతిలో కలిసి పోవాలి

2

## పెండింగ్ బిల్లులు విడుదల చేయండి..

పంచాయతీ కార్యదర్శుల బిల్లులు చెల్లించాలి

వెంటనే నిధులు విడుదల చేయాలి

మంత్రి సీతక్కకు హరీశ్ రావు లేఖ


3

## తెలంగాణ నీ తాత జాగీరా?

తెలంగాణకు 1,500 టీఎంసీలే చాలంటూ ఎలా నిర్ణయిస్తవు?

కేసీఆర్ అదనపు వాటాగా 1,950 టీఎంసీలు కోరారు

దానికి వక్రభాష్యం పలుకుతారా?

చంద్రబాబుకు గురుదక్షిణగా ఇస్తానంటే మేం ఊర్కోవాలా?

సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శ్రవణ్ మండిపాటు


2

## హైడ్రా దుర్మార్గమైన ఆలోచన..

గొప్ప విజనరీ ఉన్న నేత, స్థితప్రజ్ఞశాలీ మోదీ

స్కాములకు నిదర్శనం కాంగ్రెస్ పార్టీ

కాంగ్రెస్ చరిత్రంత అవినీతి చరిత్ర

మల్కాజిగిరి ఎంపీ ఈటల వ్యాఖ్యలు


2

## మృదువుగా కళ్లెం !

నాడు నమ్మకస్తుడంటూ పొగిడిన ముఖ్యనేత

పదవి మార్చితే ఆయనకే మొగ్గు అంటూ వార్తలు

కట్టడికి అన్నివైపులా ముఖ్యనేత బంధనాలు

సొంత శాఖలో పనులు జరగకుండా అడ్డంకులు

అదే జిల్లా నుంచి మరికొందరు నేతలకు పదవులు


2

## పాఠమెలా చెబుతున్నారు!

విద్యాబోధనపై టీచర్ల చేత తనిఖీలు

బదులో వసతులపైనా నివేదికలు


2

## యాసంగి రైతు భరోసా కథ కంచికేనా?



గత సీజన్ బకాయిలపై నోరెత్తని కాంగ్రెస్ సర్కారు

ఇంకా రూ.4 వేల కోట్ల నిధులు పెండింగ్

ఒక్క సీజన్ సకాలంలో ఇచ్చామని గొప్పలు చెప్తున్న వైనం

నేటివరకు తొమ్మిదెకరాల వరకు మాత్రమే పంపిణీ

**హైదరాబాద్ జూన్ 22(సిద్దిపేట పవర్):**

వానకాలం రైతుభరోసాను శరవేగంగా రైతుల ఖాతాల్లో జమచేస్తున్న కాంగ్రెస్ సర్కారు గత యాసంగి రైతు భరోసా బకాయిలపై మాత్రం నోరెత్తడం లేదు. ఆ బకాయిల చెల్లింపుపై ఎలాంటి ప్రకటన కూడా చేయడం లేదు. దీంతో యాసంగి రైతుభరోసాకు ప్రభుత్వం నీళ్లొదిలినట్టేనా? అనే అనుమానాలు కలుగుతున్నాయి.

గత యాసంగికి సంబంధించి 153 లక్షల ఎకరాలకు ఎకరానికి రూ.6వేల చొప్పున రూ.9,200 కోట్లు రైతుభరోసా కింద చెల్లించాల్సి ఉన్నది. అయితే ప్రభుత్వం కేవలం రూ.5 వేల కోట్లు మాత్రమే చెల్లించి మిగతా రూ.4,200 కోట్లను బకాయి పెట్టింది. ఇప్పటివరకు ఈ బకాయిలను చెల్లించనే లేదు. దీంతో నాడు భరోసా దక్కని రైతులు ప్రభుత్వం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఈ సీజన్‌లో గత సీజన్ బకాయిలతో కలిపి పంపిణీ చేస్తారనే ప్రచారం జరిగింది. కానీ తాజాగా యాసంగి

మిగతా 2వ పేజీలో..



# యాసంగి రైతు భరోసా కథ కంచికేనా?

**మొదటిపేజీ తరువాయి**

బకాయిలను పక్కనపెట్టిన ప్రభుత్వం వానకాలం రైతుభరోసా పంపిణీని ప్రారంభించింది. ఇప్పటివరకు తొమ్మిదెకరాల వరకు 66.19 లక్షల మంది రైతులకు రూ.7,770 కోట్లను పంపిణీ చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎప్పుడూ లేనంతగా ఈ ఒక్క సీజన్‌లోనే ఆగమేఘాలపై రైతుభరోసా సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నది.

**పంచాయతీ ఎన్నికల స్వార్థం**

కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి 202324 యాసంగి సీజన్ రైతుభరోసాను డిసెంబర్‌లో వేయాల్సి ఉండగా, మే నెలలో జమచేసింది. ఆ తర్వాత 202425 సీజన్‌లో వానకాలం రైతుభరోసాను పూర్తిగా ఎగ్గొట్టింది. గత యాసంగి సీజన్‌లో సగం పంపిణీ చేసిన ప్రభుత్వం మిగతా సగానికి మొండిచేయి చూపింది. ఈ సీజన్‌లో ఆగమేఘాలపై రైతుభరోసాను పంపిణీ చేస్తుండటంతో రైతుల్లో ఆశ్చర్యంతోపాటు అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. దీనివెనుక పంచాయతీ ఎన్నికల ఆలోచన ఉన్నదనే ప్రచారం జరుగుతున్నది. ఈ నెలాఖరులో ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు వెళ్లే ఆలోచన చేస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో క్షేత్రస్థాయిలో రైతుల నుంచి వ్యతిరేకతను తగ్గించడానికి, వారిని మచ్చిక చేసుకోవడానికి హడావుడిగా రైతుభరోసా సాయాన్ని విడుదల చేస్తున్నదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# తెలంగాణ నీ తాత జాగీరా?

- తెలంగాణకు 1,500 టీఎంసీలే చాలంటూ ఎలా నిర్ణయిస్తవు?
- కేసీఆర్ అదనపు వాటాగా 1,950 టీఎంసీలు కోరారు
- దానికి వక్రభాష్యం పలుకుతారా?
- చంద్రబాబుకు గురుదక్షిణగా ఇస్తానంటే మేం ఊరోక్కోవాలా?
- సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ శ్రవణ్ మండిపాటు

హైదరాబాద్ జూన్ 22(సిద్దిపేట పవర్):

'రేవంత్‌రెడ్డీ.. తెలంగాణ ఏమైనా నీ తాత జాగీరా? గోదావరి, కృష్ణా నదుల్లో మొత్తం 1,500 టీఎంసీలు తెలంగాణకు వది లి మిగితా నీళ్లను ఆంధ్రా వాళ్లు ఏమైనా చేసుకోవచ్చు.. అని అనడానికి' అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బేవరేజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్‌తో కలిసి ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ వాటా 1,500 టీఎంసీలే కాకుండా, గోదావరి నదిలో వృథా అవుతున్న 3,000 టీఎంసీలలో తెలంగాణ వాటాగా 1,950 టీఎంసీల నీటి వాటా ను 2016లోనే తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ అపెక్స్ కౌన్సెల్‌ను కోరారని చెప్పారు.

ప్రస్తుతం దానికి వక్రభాష్యం పలుకుతూ బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం కేసీఆర్ వల్లే అంటూ సీఎం రేవంత్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి.. చిల్లర రాజకీయాలకు చిరునామాగా మారాడని, సీఎం హోదాలో ఉన్న ఆయన నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలు చెప్తున్నారని తూర్పారబట్టారు. తెలంగాణ వాటా నీళ్లను చంద్రబాబును అడుక్కుంటా వా? అని నిలదీశారు. కేసీఆర్ హయాంలోనే తెలంగాణలో 86% సాగు యోగ్యమైన భూమి గా మారిందన్న విషయాన్ని తెలుసుకోవాలని హితవు పలికారు. కానీ రేవంత్ హయాంలో ఉన్నదానిలో 2% తగ్గిందని ఆరోపించారు.



**కర్రుకాల్చి వాతపెడతరు**

ఏపీ సీఎం చంద్రబాబుకు గోదావరి, కృష్ణా జలాలను పణంగా పెడితే తెలంగాణ ప్రజలు కర్రుకాల్చి వాత పెడుతారని సీఎం రేవంత్‌రెడ్డిని దాసోజు శ్రవణ్ హెచ్చరించారు. తెలంగాణ ప్రాంత ప్రయోజనాల కోసం కేసీఆర్ ముందుచూపుతో వృథా జలాలను ఒడిసి పట్టుకోవాలని ఆలోచిస్తే, రేవంత్ మాత్రం ఆ నీళ్లను చంద్రబాబుకు అప్పగించాలని కుట్రలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీని నొప్పియకుండా, చంద్రబాబును మెప్పించాలనే ధోరణితో రేవంత్ ముందుకు పోతున్నారని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై నరనరాన విషం నింపుకుని మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. పొట్టిగా ఉన్న నువు ముఖ్యమంత్రివి కాగా, మాజీ మంత్రి హరీశ్‌రావు పొడుగ్గా ఉంటే నీకొచ్చిన నష్టమేమిటని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని దాసోజు శ్రవణ్ ప్రశ్నించారు.

**దమ్ముంటే హరీశ్‌రావుతో చర్చకు రా?**

తెలంగాణపై, నదీజలాల విషయంలో, తెలంగాణ హక్కులు, వాటాలపై ఎవరికెంత జ్ఞానం ఉన్నదో తెల్చుకోవడానికి హరీశ్‌రావుతో నువు చర్చకు సిద్ధమేనా? అని సీఎం రేవంత్‌ను దాసోజు ప్రశ్నించారు. హరీశ్‌రావు ఒక్కడే వస్తడు.. దమ్ముంటే నువు 100 మందితో వచ్చినా సరే చర్చకు సిద్ధమేనని సవాల్ విసిరారు. బాడీ షేమింగ్ గురించి సీఎం స్థాయిలో ఉండి మాట్లాడొచ్చా? అని నిలదీశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు చిరుమళ్ల రాకేశ్‌కుమార్, రామచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ కరెన్సీ విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసిన బాచుపల్లి పోలీసులు

కుత్బుల్లాపూర్,జూన్ 22 (సిద్దిపేట పవర్ ):బాలనగర్ జోన్ డిసిపి కే.సురేష్ కుమార్ నిర్వహించిన పత్రిక విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ప్రతి పతి ప్రేమ్ చందు మరియు మహారాష్ట్ర లోని పూణే కు చెందిన రాకేష్ అనే వ్యక్తితో స్నేహం ఏర్పడింది. నకిలీ డబ్బులు మార్చి సులభంగా డబ్బు సంపాదించే విషయం గురించి ప్రేమ్ చందు కి తెలియజేశాడు.ఈ నకిలీ డబ్బుని హైదరాబాదులో కొందరు వ్యక్తులకు డెలివరీ చేయాలని ఉసికొలిపాడు. డబ్బు మీద ఆశతో ప్రేమ్ చందు దానికి అంగీకరించాడు. శనివారం మధ్యాహ్నం సమయంలో నిజాంపేట్ లోని ఆశ్చర్య సమీపంలో నకిలీ డబ్బును డెలివరీ చేయడానికి అక్కడికి చేరుకున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు బాచుపల్లి పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా ప్రేమ్ చంద్ వద్ద 15 లక్షల నకిలీ కరెన్సీ దొరకడంతో నిందితుని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి బాచుపల్లి పోలీస్ స్టేషన్ కి తీసుకెళ్లారు. ఈ కేసును ఛేదించిన బాచుపల్లి సీఐ ఉపేందర్ రావ్, ఎస్ఐ శ్రీనివాస్ మరి వారి బృందాన్ని డీసీపీ సురేష్ కుమార్ మరియు ఏసీబీ రవి కిరణ్ అభినందించారు.




# మృదువుగా కళ్లెం!

- నాడు నమ్మకస్తుడంటూ పొగిడిన ముఖ్యనేత
- పదవి మార్చితే ఆయనకే మొగ్గు అంటూ వార్తలు
- కట్టడికి అన్నివైపులా ముఖ్యనేత బంధనాలు
- సొంత శాఖలో పనులు జరగకుండా అడ్డంకులు
- అదే జిల్లా నుంచి మరికొందరు నేతలకు పదవులు

హైదరాబాద్ జూన్ 22(సిద్దిపేట పవర్):

'ఈయన మృదుస్వభావి, తెలివైనవాడు. నాకు అత్యంత నమ్మకస్తుడు. నాకు పాలనాపరంగా ఏమైనా అనుమానాలు వస్తే ఈయననే సంప్రదిస్తా' అని ముఖ్యనేత తరుచూ పొగిడే వ్యక్తి. కానీ ఇప్పుడు అదే ముఖ్యనేత వ్యూహంలో చిక్కి మింగలేక, కక్కలేక అన్నట్టుగా ఆయన విలవిల్లాడుతున్నారు. మేలిమి పంట కోసం ఆసామి పొలంలో మెండు కొమ్మలను నరికినట్టు.. తన పదవిని కాపాడుకునేందుకు పోటీదారులుగా భావించిన ప్రతి ఒక్కరినీ ముఖ్యనేత పక్కకు తప్పిస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాల్లోనే చర్చ జరుగుతున్నది.

ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఓ సీనియర్ నేత కాంగ్రెస్ పార్టీకి వీర విధేయుడు, పార్టీకి అత్యంత నమ్మకస్తుడని ఆయనపై ముద్ర ఉన్నది. రాష్ట్రంలోని సాధారణ కార్యకర్త నుంచి ఢిల్లీ పెద్దల వరకు అందరిదీ ఇదే భావన. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చిన వెంటనే కచ్చితంగా మంత్రి పదవి వరించే అవకాశం ఉన్న మొదటి మూడునాలుగు పేర్లలో ఆయనది కూడా ఒకటి. అనుకున్నట్టే ఆయనకు కీలకమైన, సాంకేతిక అంశాలపై అవగాహన ఉండాల్సిన శాఖలనే కట్టబెట్టారు. ఆ తర్వాత ఎప్పుడూ ముఖ్యనేతతో కలిసి కనిపిస్తుండటం, వీలుచిక్కినప్పుడల్లా ఆ ముఖ్యనేత ఈయనను పొగుడుతుండటంతో అందరూ అంతా బాగుందని అనుకున్నారు.

ఓ దశలో పాలనాపరంగా వెనుక ఉండి అంతా ఆయనే చూసుకుంటున్నారనే ప్రచారం కూడా సాగింది. అయితే ఇటీవల ముఖ్యమంత్రి పదవిని మార్చుతారనే ప్రచారం కాంగ్రెస్ వర్గాల్లో పెద్ద ఎత్తున జరిగిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో రెండు మూడు పేర్లు ప్రముఖంగా వినిపించాయి. ఇందులో నంబర్ టూ అని చెప్పుకునేవారు కూడా ఉన్నారు. అయితే వారి శాఖలపై అప్పటికే విచ్చలవిడి అవినీతి ముద్ర ఉండటంతో ప్రత్యామ్నాయ పేర్లు తెరమీదికి వచ్చాయి. ఇందులో ప్రముఖంగా ఉమ్మడి జిల్లాకు చెందిన ఈ నేత పేరు కూడా వినిపించింది. నమ్మకస్తుడు, మృదుస్వభావి, అందరినీ కలుపుకొని పోయే వ్యక్తిత్వం కాబట్టి పదవి ఇస్తే ఎవరూ అడ్డుచెప్పరనే స్థాయిలో ప్రచారం జరిగింది.

**ఇంటా.. బయట కట్టడి**

తనకు ప్రత్యామ్నాయం అనుకున్న వ్యక్తులందరినీ అసమర్థులుగా ముద్ర వేయిస్తున్నారని ముఖ్యనేతపై రాజకీయ వర్గాల్లో ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ మంత్రిపై అవినీతి ముద్ర వేసేందుకు అవకాశం పెద్దగా లేకపోవడం, ఒకవేళ బలవంతంగా అవినీతి మరకలు అంటించాలని ప్రయత్నిస్తే నమ్మే పరిస్థితి లేకపోవడంతో ముఖ్యనేత రూటు మార్చారని చెప్పుకుంటున్నారు. ఆయనను ఇంటా, బయట కట్టడి చేయాలని నిర్ణయించుకున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఈ క్రమంలో కావాలనో, కాకతాళీయంగానో తెలియదు కానీ ముఖ్యనేతతో సన్నిహితంగా మెలిగే బీజేపీ ఎంపీ ఒకరు కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి మార్పు జరిగితే సదరు మంత్రికే సీఎంగా అవకాశం ఉంటుందని వ్యాఖ్యానించారు. ఇంకేముంది ముఖ్యనేతకు అభద్రతాభావం మొదలైంది. నొసటి చిట్లింపులు, పెదవి విరుపులు మొదలయ్యాయి. సదరు మంత్రిని కట్టడి చేయడమే లక్ష్యంగా వ్యూహరచన ప్రారంభమైంది. ముఖ్యనేత తన నమ్మిన బంటుగా ఉన్న ఒక కీలక అధికారిని హెచ్‌వోడీగా చొప్పించారని, ఆయన నియామకంపై సదరు మంత్రి అభ్యంతరం చెప్పినా వినిపించుకోలేదన్న చర్చ జరుగుతున్నది.

ముఖ్యనేత ఆదేశాలు తప్ప ఎవరి ఆదేశాలనూ తాను పాటించాల్సిన అవసరం లేదని సదరు అధిపతి బహిరంగంగానే చెప్పుకుంటున్నట్టు సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. వీరే కాకుండా విజిలెన్స్ అధికారుల నుంచి రోజువారీ ఇసుక వ్యాపారం వివరాలు తెప్పిస్తున్నట్టు ప్రచారం జరుగుతున్నది. మరోవైపు ఆ నేత సొంత నియోజకవర్గానికి సంబంధించి కూడా ఎలాంటి పనులు జరగనీయకుండా ముఖ్యనేత అడ్డుపడుతున్నట్టు చెప్పుకుంటున్నారు. సదరు మంత్రి శాఖకు సంబంధించిన కీలక నిర్ణయాలను ఆయనకు తెల్వకుండా బైపాస్ చేసి తీసుకోవడం ద్వారా డ్యామేజ్ జరిగాక బాధ్యతను ఆయన వైపు నెట్టడం నిత్యకృత్యంగా మారిందట. ఇదంతా ఆయనను బద్నాం చేసే వ్యూహంతోనే సాగుతున్నది.

**శాఖ మార్చమంటావా?**

అటు సొంత నియోజకవర్గంలో పనులుకాక, ఇటు తన పరిధిలోని శాఖల్లో విలువ లేక ఇదేం వ్యవహారమంటూ సదరు నేత అసంతృప్తితో ఉన్నట్టు కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. ఇదే విషయాన్ని ప్రస్తావించేందుకు ముఖ్యనేత దగ్గరికి వెళ్తే, శాఖలు మార్చుదామంటూ ఉచిత సలహాలు ఇస్తున్నట్టు కాంగ్రెస్ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఢిల్లీ పెద్దలకు నిధులు సమకూర్చే శాఖను అప్పగిస్తానని చెప్తున్నారట. ఇప్పుడున్న మంత్రిని మార్చేయాలని అధిష్ఠానమే చెప్తున్నదని, కాబట్టి ఆ పదవి తీసుకోవాలని సూచిస్తున్నట్టు తెలిసింది.

దీంతో అలా ఎందుకు చెప్తున్నారో అర్థమై సదరు నేత తీవ్ర ఆలోచనలో పడ్డారని సమాచారం. ప్రస్తుతం ఆ పదవిలో ఉన్న మంత్రిపై ఒకప్పుడు అధిష్ఠానం పూర్తి సానుకూలంగా ఉండేదని, ముఖ్యమంత్రి అవుతారనే ప్రచారం కూడా జరిగిందని, కానీ ఏడాదిన్నరలో అవినీతి ముద్ర పడేలా చేయడంతో ఏకంగా పదవి నుంచి తొలగించే స్థాయికి పరపతి పడిపోయిందని సదరు నేత విశ్లేషిస్తున్నారట. అలాంటి పదవిని తనకు ఆఫర్ చేయడమంటే తనను కూడా భ్రష్టుపట్టించే పన్నాగమా? అంటూ ఆయన వాపోతున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి.



**పదవులతో బంధనం**

తనకు పోటీగా మారే అవకాశం ఉన్న ఆ నేతకు జిల్లాలో కూడా చెక్ పెట్టాలని ముఖ్య నేత నిర్ణయించుకున్నట్టు చెప్తున్నారు. ఇందులో భాగంగా ఓ వర్గం ఎమ్మెల్యేలకు మంత్రి పదవి అనే అంశాన్ని ముఖ్యనేత తెరమీదికి తీసుకొచ్చారని, వినతులు, మెమోరాండం, విజ్ఞప్తులతో వారిని హైదరాబాద్ నుంచి ఢిల్లీ వరకు తిప్పించి అధిష్ఠానం మీద ఒత్తిడి తీసుకొచ్చినట్టు పార్టీ నాయకులే చెప్తున్నారు. ఫలితంగా ఆ నేతకు చెందిన జిల్లాలోనే మరో ఇద్దరికి తాజా ఉన్నత పదవులు ఇచ్చినట్టు ప్రచారం జరుగుతున్నది. ఉమ్మడి జిల్లాపరంగా చూస్తే ప్రభుత్వంలో కీలక పదవుల్లో ఉన్నవారు నలుగురు ఉన్నారు. సొంత జిల్లా, ఉమ్మడి జిల్లాలో ఆ నేతను కట్టడి చేయడానికే వరుసగా పదవులు ఇచ్చారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

# పాఠమెలా చెబుతున్నారు!

- విద్యాబోధనపై టీచర్ల చేత తనిఖీలు
- బడుల్లో వసతులపైనా నివేదికలు

హైదరాబాద్ జూన్ 22(సిద్దిపేట పవర్):

టీచర్లు పాఠాలెలా చెబుతున్నారు.. వసతులెలా ఉన్నాయన్న విషయాలపై విద్యాశాఖ ఆరా తీయనున్నది. రాష్ట్రంలో 1.11లక్షల మంది టీచర్లు పనిచేస్తున్నారు. వీరిలో 2 శాతం అంటే 2వేల మంది టీచర్లు మొత్తం 24,146 బడుల్లో తనిఖీలు చేపట్టనున్నారు. మార్గదర్శకాలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ శనివారం విడుదల చేశారు. త్రైమాసిక, వార్షిక పర్యటన షెడ్యూల్ ప్రకారం తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది.

ఈ తనిఖీల కోసం ప్రత్యేకంగా ఫార్మాట్, చెక్‌లిస్టును ఉపయోగించాలని సూచించింది. మూడు నెలలకు 50 పాఠశాలలను తనిఖీ చేయాల్సి ఉంటుంది. ఈ తనిఖీల్లో పాఠ్యాంశాలు, లెస్సన్‌ప్లాన్‌ల పరిశీలనపై ప్రత్యేక దృష్టిపెడతారు. గ్రంథాలయాలు, ప్రయోగశాలలు, సహపాఠ్య కార్యక్రమాలు, స్పోర్ట్స్, డిజిటల్ ఎడ్యుకేషన్, పీఎం పోషణ్, ఆరోగ్య తనిఖీలు, టాయిలెట్లు, తాగునీరు, ప్రహరీలు, విద్యుత్తు, ఆడిటోరియం, ఆటస్థలాలు, యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్ పంపిణీ పరిస్థితి, ఫలితాలు, పాఠ్యప్రణాళికల అమలును పర్యవేక్షిస్తారు.



# "చర్చలు జరిపేదే లేదు.. ఆయుధాలు విడిచి లొంగిపోండి.."

- మావోయిస్టులకు వరుసగా ఎదురుదెబ్బలు
- మావోలతో ఎలాంటి చర్చలు జరిపేదే లేదు
- ఆయుధాలు విడిచి జనజీవన స్రవంతిలో కలిసి పోవాలి
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యలు

ఛత్తీస్‌గఢ్ జూన్ 22(సిద్దిపేట పవర్):

మావోయిస్టులకు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఇప్పటికే దాదాపు కీలక నేతలు హతమయ్యారు. వారికి కంచుకోట అయిన ఛత్తీస్‌గఢ్‌లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌తో నెత్తురోడుతోంది. ఈ అంశంపై తాజాగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. మావోయిస్టులతో ఎలాంటి చర్చలు జరిపేదే లేదని పునరుద్ఘాటించారు. ఆయుధాలు విడిచి జనజీవన స్రవంతిలో కలిసి పోవాలని సూచించారు. వర్షాకాలంలో కూడా నక్సల్స్ ఏరివేత కొనసాగుతుందని వెల్లడించారు. మార్చి 2026లోగా నక్సలైట్లను నిర్మూలిస్తామని పునరుద్ఘాటించారు. ఆయుధాలు వదలిన వారిని హృదయపూర్వకంగా స్వాగతిస్తామని వెల్లడించారు. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించిన అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేశారు.



"విష్ణు దేవ్ సాయి ప్రభుత్వం దూసుకుపోతుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా కొనియాడారు. నక్సల్స్ ఏరివేతలో అతిపెద్ద విజయం సాధించామని.. అందుకు రాష్ట్ర ప్రభుత్వం సహకారాన్ని ప్రశంసించారు. నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌ను వేగవంతం చేస్తామని తెలిపారు. తాను గత పదకొండు సంవత్సరాలుగా ఛత్తీస్‌గఢ్‌కు వస్తున్నానని వెల్లడించారు. ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన ఘనత ప్రధాని మోడీదే అని కొనియాడారు. ఈ వేదిక మీదుగా అమిత్ షా నక్సల్స్‌కి మరో ఛాన్స్ ఇచ్చారు. ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలిసి పోవాలని వెల్లడించారు.

# ఆర్టీసీ కార్మికులకు 'ఎలక్ట్రిక్' షాక్

- రోడ్డున పడనున్న 10 వేలమంది ఉద్యోగులు, కార్మికులు?
- టీజీఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్‌ల రాకతో ఉద్యోగాలకు ముప్పు
- కేంద్రం అసంబద్ధ పథకం... రాష్ట్ర ప్రభుత్వం అలసత్వం
- అనుభవంలేని డ్రైవర్లతో సురక్షిత ప్రయాణం ప్రశ్నార్థకం
- ప్రభుత్వాల తీరుపై కార్మిక సంఘాల నేతల మండిపాటు

హైదరాబాద్ జూన్ 22(సిద్దిపేట పవర్):

ఒకరు కాదు.. ఇద్దరు కాదు.. ఏకంగా పదివేల మంది ఆర్టీసీ కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తమవుతున్నది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి ఈడ్రైవ్' పథకంలో భాగంగా 2800 బస్సులు ఇవ్వాలని రాష్ట్రప్రభుత్వం కోరగా, 2000 బస్సులు ఇచ్చేందుకు కేంద్రం అంగీకరించింది.

గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) విధానంలో ఇప్పటికే వందల బస్సులు అందుబాటులోకి వచ్చాయి. ఈ బస్సుల నిర్వహణ బాధ్యత మొత్తం ప్రైవేటు సంస్థ చేతుల్లోనే ఉంటుంది. కాబట్టి డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ కార్మికులంతా సంస్థకు చెందినవారే ఉంటారు. దీంతో ఆర్టీసీలోని సుమారు 10 వేల ఉపాధిని కోల్పోయే ప్రమాదముందని కార్మిక సంఘాల నేతలు చెప్తున్నారు.

**ప్రైవేటుకు వరం... ఆర్టీసీకి భారం**

కేంద్రం మొదటి దశలో వివిధ రాష్ట్రాల ఆర్టీసీలకు 14,028 ఎలక్ట్రిక్ బస్సులను రాయితీపై అందించాలని నిర్ణయించింది. ఈ రాయితీని కార్పొరేట్ సంస్థకు ఇస్తుందని కార్మిక సంఘాల నేతలు చెప్తున్నారు. మరమ్మతులు కూడా ప్రైవేటు సంస్థనే చూసుకుంటుంది కాబట్టి ఆర్టీసీ గ్యారేజీలు ఉనికిని కోల్పోతాయని చెప్తున్నారు. ఇప్పటికే ఆర్టీసీ డిపోల పరిధిలో ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆర్టీసీ వనరులను వాడుకుంటూ ప్రైవేటు కంపెనీ లబ్ధి పొందుతుందని, ఆర్టీసీకి, కార్మికులకు, ప్రజలకు ఎలాంటి ఉపయోగంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

కార్మికుల పొట్టకొట్టకుండా తెలంగాణ ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసేలా అధికారాలు ఇవ్వాలని, రాష్ట్రప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం.. కేంద్రంపై ఎలాంటి ఒత్తిడి తీసుకురావడంలేదని మండిపడుతున్నారు. కేంద్రం అందించే ఎలక్ట్రిక్ బస్సులు నేరుగా ఆర్టీసీకి ఇవ్వాలని కోరుతున్నారు. అనుభవం లేని ప్రైవేటు డ్రైవర్లతో ప్రయాణికుల భద్రత కూడా ప్రశ్నార్థకం కానుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ (జీసీసీ) పద్ధతిని రద్దుచేసి, ఆర్టీసీలే స్వయంగా ఎలక్ట్రిక్ బస్సులను కొని నడుపుకోవడానికి పథకంలో సవరణలు చేయాలని కార్మిక సంఘాల నేతలు కోరుతున్నారు.




# హైడ్రా దుర్మార్గమైన ఆలోచన..

- గొప్ప విజనరీ ఉన్న నేత, స్మితప్రజ్ఞశాలీ మోడీ
- స్కాములకు నిదర్శనం కాంగ్రెస్ పార్టీ
- కాంగ్రెస్ చరిత్రంత అవినీతి చరిత్ర
- మల్కాజిగిరి ఎంపీ ఈటల వ్యాఖ్యలు

హైదరాబాద్ జూన్ 22(సిద్దిపేట పవర్):

గొప్ప విజనరీ ఉన్న నేత, స్మితప్రజ్ఞశాలీ మోడీ అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. స్కాములకు నిదర్శనం కాంగ్రెస్ పార్టీ అని విమర్శించారు. కాంగ్రెస్ చరిత్రంత అవినీతి చరిత్ర.. ఎండ్లకు ఏండ్లు అవమాన పడి, కొట్లాడి, ఎదురునిలిచి త్యాగాలు చేసి తెలంగాణను సాధించుకున్నామని గుర్తు చేశారు. రేవంత్ వల్ల తెలంగాణ ఆతగౌరవం దెబ్బతిన్నదని ఆరోపించారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానపరిచారన్నారు.. దేశాన్ని ప్రపంచానికే విశ్వగురువుగా నిలబెట్టిన ఘనత మోడీదని కొనియాడారు. దేశం విశ్వగురువుగా ఎదుగుతుందని..



మోడీ అంటే దేశానికి నమ్మకమన్నారు. వర్క్ స్పీక్ ఎవ్రీథింగ్ అనే సూత్రానికి నిదర్శనం మోడీ అన్నారు. శ్యామ ప్రసాద్ ముఖర్జీ అడుగు జాడల్లో నడుస్తున్న నేత మోడీ అని.. కాలికి ముళ్ళు నాటితే నోటితే తీసే నాయకుణ్ణి ప్రజలు కోరుకుంటారన్నారు.

# రైతు భరోసా నిధుల పంపిణీలో రికార్డు..

- కేవలం 6 రోజుల్లో రూ. 7700 కోట్లు
- 16వ తేదీన రైతు నేస్తం వేదిక పంపిణీ షురూ..

**హైదరాబాద్ జూన్ 22(సిద్దిపేట పవర్):**

రైతు భరోసా నిధుల పంపిణీలో రికార్డు సృష్టించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కేవలం 6 రోజుల్లో రూ. 7700 కోట్లు పంపిణీ చేసినట్లు వెల్లడించింది. ఏడేండ్లలో రైతులకు నిధుల పంపిణీలో ఇదే రికార్డు అని తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన ప్రకారం.. రాష్ట్రంలోని రైతులకు వానాకాలం పంటల పెట్టుబడి సాయంగా అందించటంలో తెలంగాణ ప్రభుత్వం సరికొత్త రికార్డు నమోదు చేసింది. తొమ్మిది రోజుల్లో రూ. 9 వేల కోట్లు జమ చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వం ఈసారి వేగంగా రైతుల ఖాతాల్లో నిధులను జమ చేసింది.

ఈసారి జూన్ 16వ తేదీన రైతు నేస్తం వేదికగా స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా చెల్లింపులను ప్రారంభించారు. తొలి ఆరు రోజుల్లోనే 66.19 లక్షల మంది రైతులకు రూ. 7770.83 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేసింది. శనివారం నాటికే రాష్ట్రంలో 9 ఎకరాల్లోపు భూములున్న రైతులందరి ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమయ్యాయి. గడిచిన ఏడేండ్లలో ఇంత వేగంతో రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయటం ఇదే మొదటిసారి.

వానాకాలం పంటలకు సంబంధించి గతంలో రైతులకు పంటలకు పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం గరిష్టంగా 169 రోజుల వరకు సాగదీసినట్లు పంపిణీ చేసింది. వ్యవసాయ శాఖ వద్ద అందుబాటులో ఉన్న రికార్డుల ప్రకారం 2021లో 11 రోజుల వ్యవధిలో రూ.7360 కోట్లు జమ చేయటం ఇప్పటి వరకు ఉన్న రికార్డు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం అంతకంటే వేగంగా 6 రోజుల్లోనే రూ.7770 కోట్లు పంపిణీ చేసింది. తొమ్మిది రోజుల్లో మొత్తం రూ. 9 వేల కోట్ల పంపిణీని విజయవంతంగా పూర్తి చేయాలని ఆర్థిక శాఖ, వ్యవసాయ శాఖ నిర్ణయించింది.



## పెండింగ్ బిల్లులు విడుదల చేయండి..

- పంచాయతీ కార్యదర్శుల బిల్లులు చెల్లించాలి
- వెంటనే నిధులు విడుదల చేయాలి
- మంత్రి సీతక్కకు హరీశ్ రావు లేఖ

**హైదరాబాద్ జూన్ 22(సిద్దిపేట పవర్):**

గ్రామాల్లో కుంటుపడిన పారిశుద్ధ్యం, మాజీ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల పెండింగ్ బిల్లుల చెల్లింపు, ఔట్ సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శుల క్రమబద్ధీకరణ, ఇతర సమస్యల గురించి మంత్రి సీతక్కకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు లేఖ రాశారు.

గ్రామాల సమగ్ర అభివృద్ధిలో భాగంగా 2019లో నాటి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ ప్రభుత్వం 9,350 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించింది. ప్రభుత్వ ఆదేశానుసారం గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం వారు ఎంతో శ్రమించారు. గ్రామ పంచాయతీలకు సకాలంలో నిధులు మంజూరు చేయడం, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, గ్రామ పంచాయతీ అధికారుల కృషి వల్ల తెలంగాణ గ్రామాలు అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పరిస్థితులు ఇందుకు భిన్నంగా మారాయి. నిధులు విడుదల లేకపోవడంతో గ్రామ పంచాయతీల అభివృద్ధి ఎక్కడిక్కడే నిలిచిపోయింది. పారిశుద్ధ్యం పడకేసింది. వీధి దీపాల నిర్వహణ లేక పల్లెలు అంధకారంలో ఉంటున్నాయి. చివరకు బిఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ట్రాక్టర్లలో డీజిల్ పోయించలేక, ఆర్టీఏ టాక్స్ కట్టలేక అధికారులకు తాళాలు అప్పగిస్తున్న దుస్థితి వచ్చింది అని హరీశ్‌రావు పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినప్పటికీ, పంచాయతీ అధికారులు అప్పులు తెచ్చి మరీ నిర్వహణ కొనసాగించే ప్రయత్నం చేసారు. ఒకవైపు రోజురోజుకీ అప్పులు పెరగటం, మరోవైపు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడం వల్ల పంచాయతీ కార్యదర్శులపై ఆర్థిక భారం మరింత పెరిగింది. దీంతో వారు మానసిక ఆందోళనకు గురవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తే నిధులు విడుదల మరింత కష్టతరం అవుతుందని బాధపడుతున్నారు. ఇదే విధంగా మాజీ సర్పంచులు సైతం చేసిన పనులకు బిల్లులు రాక తీవ్ర ఆందోళన చెందుతున్నారు అని హరీశ్‌రావు తెలిపారు.





## ఈ నెల 24 న సిద్దిపేట,మెదక్ జిల్లాలలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రాక

**దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతరాజు శంకర్**

**చిన్నకోడూర్, జూన్22( సిద్దిపేట పవర్ ):**నెల 24న సిద్దిపేట జిల్లాలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ పర్యటిస్తున్నదని దళిత బహుజన ఫ్రంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతరాజు శంకర్ తెలిపారు. 24 న ఉదయం 1030 గంటలకు సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అట్రాసిటీ, ఎస్సీ, ఎస్టీల సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించ నున్నందున బాధితులు తమ సమస్యల పై పిర్యాదులు చేయాలన్నారు. జిల్లాలోని అట్రాసిటీ కేసులు, ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారంకు కమిషన్ ను సంప్రదించి, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విన్నవించారు.



## కడవేరుగు బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి

- అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వీడాలి
- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్

**చేర్యాల, జూన్ 22 (సిద్దిపేట పవర్):** చేర్యాల మండలం కడవేరుగు గ్రామంలో నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్ డిమాండ్ చేశారు. చేర్యాల మండలంలోని కడవేరుకు గ్రామంలో వంతెన నిర్మాణం చేపట్టాలని గత కొన్ని సంవత్సరాలుగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో చేసిన పోరాట ఫలితంగా 2 కోట్ల 80లక్షల రూపాయలు మంజూరు కావడంతో వంతెన నిర్మాణం పనులు 80 శాతం పనులు జరిగిన నేటి వరకు పూర్తికాకపోవడం కాంట్రాక్టర్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపధ్యంలో బురదమయంగా మారి నిత్యం ప్రయాణించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డి, మండల కోశాధికారి నంగి కనకయ్య, మండల నాయకుడు పోనుగోటి శ్రీనివాస్ రెడ్డి,మనేపల్లి కిష్టయ్య, ఎగుర్ల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.




## దుబ్బాక పట్టణంలో నీలకంఠ కమ్యూనిటీ హాల్ కు శంకుస్థాపన చేసిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ జూన్ 22**

ఈ కార్యక్రమంలో నీలకంఠ సంఘం అధ్యక్షులు బోడ శ్రీహరి, సంఘం సభ్యులు రొట్టె, రాజ మౌళి పంతులు, ఆస యాదగిరి ఎస్సీ ఎస్టీ కమిషనర్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు..





## గజ్వేల్ ప్రజ్ఞాపూర్ లోఎలైట్ హోమ్స్ వెంచర్ ప్రారంభం

**ఎలైట్ హోమ్స్ బ్రోచర్ ఆవిష్కరణ**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ రింగు రోడ్డు లో సిద్దిపేట నుండి హైదరాబాద్ వెళ్లే రోడ్డు పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ఎలైట్ హోమ్స్ వెంచర్ ఆదివారం ఘనంగా ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ భక్కి వెంకటయ్య, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ తాజా మాజీ చైర్మన్ రాజమౌళి, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఎలైట్ హోమ్స్ వెంచర్ బ్రోచర్ ఆవిష్కరించి యాజమాన్యం రాఘవేందర్ రెడ్డి వారి బృందానికి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యాజమాన్యం వారు మాట్లాడుతూ ఎలైట్ హోమ్స్ డి టి సి పి ఫైనల్ అప్రూవ్డ్ లే అవుట్ ప్రారంభించడం జరిగిందని అన్నిరకాల సౌకర్యాలతోనూతన గృహాలు నిర్మాణానికి అనుకూల ప్రాంతం అని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పట్టణ, పరిసర ప్రాంత, తెలంగాణ, ఆంధ్ర ప్రాంత ప్రజలకు సువర్ణ అవకాశం అని, పెట్టుబడికి అనుకూల ప్రాంతం అని అన్నారు ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గాప్రసాద్, శ్రీనివాస్ రెడ్డి, చంద్ర మోహన్ రెడ్డి,రాజిరెడ్డి, రవీందర్ రెడ్డి, అత్తెల్లి శ్రీనివాస్, కొమరవెల్లి సుధాకర్రొయ్యల కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.



## నీచ రాజకీయాలకు తెరలేపిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు.

**అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం**

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ జూన్ 22** అక్బర్ పేట భూంపల్లి మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడు గడ్డం యాదగిరి మాట్లాడుతూ గోష్క మల్లేశం బేస్ మీట్ వేసి పిల్లర్స్ లేపడం జరిగింది. ఏఈ గారు ఇందిరమ్మ ఇండ్ల ఎంక్వయిరీ కి వచ్చినప్పుడు కొంచెం బేస్మెంట్ తీసేయాల్సి వస్తుంది అలా కట్టుకుంటే ఇల్లు మంజూరు చేస్తామని తెలపడం జరిగింది. కానీ గోషిక మల్లేశం లేదు నేను అలా చేయలేను ఇలాగే కట్టుకుంటాను అని చెప్పడం తోటి అతనికి ఇల్లు మంజూరు కాలేదు. గోష్కే మల్లేశం ఇప్పటికీ కూడా ఏఈ గారు చెప్పినట్టు ఇల్లు కట్టుకుంటే తప్పనిసరిగా ఇందిరమ్మ ఇల్లు ఇప్పిస్తామని అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దీనిని బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం పైన, దుబ్బాక ఇన్చార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పైన, దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ పైన మల్లేశం తోటి ఈ విధంగా మాట్లాడించి నీచ రాజకీయాలకు తెర లేపారన్నారు. రాజకీయాలకు అతీతంగా గ్రామంలో ఆరుగురికి దళితులకు, ఆరుగురికి బీసీలకు, ఒక ఓసి కి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి అందరికీ న్యాయం చేయాలని చూస్తున్న దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పాతూరి వెంకటస్వామి గౌడ్ పై బీఆర్ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలకు తెర లేపడం వారి అవివేకానికి నిదర్శనమని తెలిపారు. గతంలో ఇదే బిఆర్ఎస్ నాయకులు తాళ్లపల్లి గ్రామానికి ఒక్క డబుల్ బెడ్ రూము ఇల్లు కూడా తీసుకురాలేదు. తాళ్లపల్లి గ్రామాన్ని పాతూరి వెంకటస్వామి గౌడ్ అభివృద్ధి చేయాలని చూస్తుంటే బిఆర్ఎస్ నాయకులు మేము చేయలేని అభివృద్ధి చేస్తుండు అతనికి మంచి పేరు వస్తుందని ఓర్వలేక పోతున్నారు అని అన్నారు. గోష్క మల్లేశం బిఆర్ఎస్ కార్యకర్త అయిన ఇందిరమ్మ ఇళ్ల నామ్స్ ప్రకారం ఇల్లు కట్టుకుంటే అతనికి తప్పనిసరిగా మా నాయకుడు చెరుకు శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఇల్లు మంజూరు చేయిస్తామని, అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని గడ్డం యాదగిరి తెలిపారు.






## గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- డిమాండ్ల సాధన కోసం చలో హైదరాబాద్
- చొప్పరి రవికుమార్ సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి

**నంగునూరు, జూన్ 22 సిద్దిపేట పవర్** గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించి వారికి గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని సీఐటీయూ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. నంగునూరు మండల గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమావేశం ఆదివారం నంగునూరులో జరిగింది. గ్రామపంచాయతీ కార్మికుల మండల శాఖ అధ్యక్షుడు దేవులపల్లి రాజమౌళి అధ్యక్షతన జరిగిన సమావేశానికి చొప్పరి రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులు ఉద్యోగులకు రెండు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. జీవో నెంబరు 51ని సవరించి మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. భీమా సౌకర్యాలను రూ.15 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం చలో పంచాయతీ రాజ్ కమిషనరేట్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 27 వ తేదీన నిర్వహించే ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులకు ప్రతి నెల గ్రీన్ చానల్ ద్వారా రెగ్యులర్ గా వేతనాలు చెల్లిస్తామని చెప్పి పట్టించుకోవడం లేదని వాపోయారు. నెలల తరబడి వేతన బకాయిలు పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉద్యమాలు చేస్తే ఆరు నెలల వేతనాలు విడుదల చేశారన్నారు. రాష్ట్ర ఖజానా నుండి నేరుగా చెల్లిస్తామని చెప్పి రెండు నెలల వేతనాలు పెండింగ్లో ఉంచి కార్మికులను ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వం జీవో నెంబర్ 51ను సవరించి ద్వారా మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేస్తామని చెప్పి, 18 నెలలు పూర్తి కావస్తున్నప్పటికీ ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయకపోవడంతో కార్మికులు అనేక ప్రమాదాలకు గురై అంగవైకల్యం చెందుతున్నారన్నారు. కొంతమంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయితీ కార్మికుల ప్రాణాలకి భద్రత కరువైందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి ఇన్సూరెన్స్ సౌకర్యం 15 లక్షల వరకు అవకాశం కల్పించాలని కోరారు. డిమాండ్ల సాధన కోసం ఈనెల 27వ తేదీన పంచాయితీ రాజ్ కమిషనరేట్ ముట్టడిలో భాగంగా చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి చిట్యాల కనకయ్య, ఉపాధ్యక్షుడు పిల్లి రవీందర్, జీడి కంటి కనకవ్వ, కార్యదర్శి బెల్లం బాలయ్య, గుండ్రాతి కనకయ్య, పిడిశెట్టి సుధాకర్, నీల కళ, బత్తుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి అండగా చక్రధర్ గౌడ్

**తక్షణ సాయంగా రూ.10వేల ఆర్థిక సహాయం**

**నంగునూరు జూన్ 22 సిద్దిపేట పవర్** సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన కల్లూరి గాలవ్వ శనివారం అనారోగ్యంతో మృతి చెందింది. గాలవ్వ కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని గాలవ్వ చనిపోయిన విషయాన్ని నంగునూరుకు చెందిన గోనెపల్లి శివప్రసాద్ ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు గాదగోని చక్రధర్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన చక్రధర్ గౌడ్ గారు తక్షణ సహాయంగా రూ.20 వేల ఆర్థిక సహాయం ప్రకటించి, డబ్బులను పంపించారు. ఈ డబ్బులను ఆదివారం గాలవ్వ కుటుంబ సభ్యులకు గోనెపల్లి శివప్రసాద్ అందించారు. ఈ సందర్భంగా చక్రధర్ గౌడ్ గాలవ్వ కుటుంబ సభ్యులను ఫోన్ లో పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబానికి అండగా ఉండి ఆదుకుంటానని హామీ భరోసా ఇచ్చారు. ధైర్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, రాజు, నవీన్, రాజు, కిషన్, గాలవ్వ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు





# అణగారిన వర్గాల సమస్యలపై ఎమ్మార్పీఎస్ భవిష్యత్ పోరాటాలు

- జూలై 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం ప్రతి గ్రామాన ఘనంగా నిర్వహించాలి
- సిద్దిపేట జిల్లా ఇన్చార్జి మంద కుమార్ మాదిగ పిలుపు

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం:** జగదేవపూర్ మండల ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల ముఖ్య నాయకుల సమావేశం శ్రీ కొండా పోచమ్మ దేవస్థానం వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఎస్పి జాతీయ నాయకులు మంద కుమార్ మాదిగ హాజరై మాట్లాడుతూ దేశవ్యాప్తంగా పీడిత వర్గాలను ఏకం చేద్దాం అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు నడుద్దాం అన్నారు. జులై 7న మాదిగల ఆత్మగౌరవ ప్రతీకైన ఎమ్మార్పీఎస్ జెండా ప్రతి గ్రామంలో ఎగరాలని పిలుపునిచ్చారు. విద్యా ఉద్యోగాల్లో వర్గీకరణ ఫలాలు అందుకునే విధంగా మాదిగ విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి అన్నారు. 78 యేండ్ల స్వతంత్ర భారతదేశంలో 30 ఏళ్లుగా సజీవంగా నిలబడి లక్ష్యాన్ని ముద్దాడిన ఏకైక సామాజిక ఉద్యమం ఎమ్మార్పీఎస్ మాత్రమే అని ఈ ముప్పై ఏళ్ల కాలంలో దండోరా జెండా మాదిగల వరకే పరిమితం కాకుండా సమస్త పీడిత అణగారిన వర్గాలకు అండగా నిలిచిందని అన్నారు ఎమ్మార్పీఎస్ మాదిగల కోసమే ఏర్పాటు చేసిన, మాదిగల వరకే పరిమితం కాలేదని ఈ సమాజంలో పీడింపబడుతున్న ప్రతి వర్గం పక్షాన నిలబడి తన పోరాటాలను నిర్వహించిందని పాలకులు విస్మరించిన ప్రతిపక్షాలు పార్టీలు పట్టించుకోని సమస్యలను ప్రజల పక్షాన ఎజెండాగా చేసుకుని పాలకుల మెడలు వంచి అనేక సంక్షేమ పథకాలను ఫలితాల రూపంలో సమాజానికి అందించిందని అన్నారు. ఆరోగ్య శ్రీ అయిన, వికలాంగుల పెన్షనైన, వృద్ధులు వితంతువుల పెన్షనైన ఆకలి కేకల పోరాటంతో రేషన్ కోట బియ్యం పెంపైన ఫాస్ట్ ట్రాక్కోర్టులైన ఇలా ప్రతి వర్గం పక్షాన నిలబడి సమాజం పట్ల తన బాధ్యతను నిర్వర్తించిందని గుర్తు చేశారు. ఇప్పుడు అంబేద్కర్ ఉన్నప్పటి నుండి నేటి వరకు మిగిలి ఉన్న సమస్యల పరిష్కారం కోసం పీడిత వర్గాలను ఏకం చేసి దేశవ్యాప్త ఉద్యమాన్ని ఎమ్మార్పీఎస్ నిర్మిస్తుందని అన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ఎస్సీ రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన అందక పోవడం వల్లనే మాదిగలు అన్ని రంగాల్లో వెనుకబడిపోయారు. కనుక జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరించాలని మందకృష్ణ మాదిగ నేతృత్వంలో ముప్పై ఏళ్ళ రాజీలేని పోరాటం సాగిందని, ఆ పోరాట ఫలితంగానే నేడు తెలంగాణ రాష్ట్రంలో వర్గీకరణ చట్టం అమలులోకి వచ్చిందని, దాని ద్వారా మాదిగలకు 9% రిజర్వేషన్లు దక్కాయి. ఎన్నో త్యాగాల ద్వారా సాధించుకున్న రిజర్వేషన్ ఫలాలు మాదిగ విద్యార్థులు నిరుద్యోగులు అందిపుచ్చుకొని అన్ని రంగాల్లో అభివృద్ధిలోకి రావాలని, అందుకోసం వర్గీకరణ ఫలాలు అందుకునే విధంగా మాదిగ విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి కోరారు.ఈ దేశంలో 100% సక్సెస్ రేట్ ఉన్న ఏకైక నాయకుడు మందకృష్ణ మాదిగ గారేనని, వారి సారథ్యంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం అసమానతలు లేని నూతన సమాజ నిర్మాణం కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా ఎమ్మార్పీఎస్ కో ఇన్చార్జి ముక్కపల్లి రాజు మాదిగ , జగదేవపూర్ మండల మార్ప్స అధ్యక్షుడు పోసాన్ పల్లి రాజు మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షులు గడ్డం సురేందర్ అధికార ప్రతినిధి తప్పెట్ల కరుణాకర్, ప్రచార కార్యదర్శి పైస స్వామి, తిగుల్ నర్సాపూర్ మాజీ సర్పంచ్ మాసపాక యాదగిరి దౌలాపూర్ గ్రామ అధ్యక్షులు ముక్కెర నాగరాజు అనంతసాగర్ గ్రామ అధ్యక్షులు ప్రభాకర్, జంగారెడ్డిపల్లి గ్రామ అధ్యక్షులు నర్సిలు,గుంద్రు ఉప్పలయ్య, స్వామి, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యా రంగ పటిష్టతకు కృషి చేయాలి


**పులగం దామోదర రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



**సిద్దిపేట, జూన్ 22: సిద్దిపేట పవర్**

విద్యారంగ వ్యవస్థను పటిష్టపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్ రెడ్డి కోరారు. తాళ్ల యేసు రాజు ఉద్యోగ విరమణ అభినందన సభ ఆదివారం సిద్దిపేటలో జరిగింది. పీఆర్టీయూ టీఎస్ సిద్దిపేట అర్బన్ మండల నుంచి అధ్యక్షుడు వంగ వెంకట రాంరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో దామోదర్ రెడ్డి మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా యేసు రాజుగారు విద్యా రంగంలో అందించిన సేవలను కొనియాడారు. ఉపాధ్యాయులకు రావలసిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే విడుదల అయ్యేటట్టుగా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తానని, అదేవిధంగా ఉపాధ్యాయుల పెండింగ్ డీఏల తో పాటు, పీఆర్సీని అమలయ్యే విధంగా కృషి చేస్తామని తెలిపారు. బడి బాటలో భాగంగా "బడి మనది బాధ్యత మనదే "అనే నినాదంతో పీఆర్టీఎస్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీ పాల్ రెడ్డితో కలిసి బడి బాటలో పాల్గొని ఉపాధ్యాయులను ప్రోత్సహిస్తూ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 800 గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్ల, బదిలీలను నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు తరగతికి ఒక ఉపాధ్యాయుని చొప్పున ఉండేలా ప్రభుత్వానికి సూచన చేశామని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గా పోటీ చేసిన వంగ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు కోసం కృషి చేస్తామని తెలిపారు. విద్యారంగ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షులు శ్రీ మల్లుగారి ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో పీఆర్టీఎస్ పటిష్టంగా ఉందని చెప్పారు. ఉపాధ్యాయులు ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని అందుకు పీఆర్టీయూ సిద్దిపేట జిల్లా శాఖ పూర్తి సహకార సహకారం అందిస్తుందని తెలిపారు. జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి అదరాసు పల్లి శశిధరశర్మ మాట్లాడుతూ పదవి విరమణ పొందిన యేసు రాజు గారి సేవలను కొనియాడారు. భవిష్యత్తులో వారు సామాజిక కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పీఆర్టియూ మాస పత్రిక సంపాదక వర్గ సభ్యురాలు విజయ, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ముత్యాల సురేందర్ రెడ్డి, కత్తుల బాపు రెడ్డి, పాతూరి సుజాత, పాతూరి రమాదేవి, చామకూర అనిల్ కుమార్, కె.వెంకటేశ్వర్లు, ఆస దశరథం, నర్ర మహేందర్ రెడ్డి, నర్ర భాస్కర్ రెడ్డి, ఆస లక్ష్మణ్, బి మల్లారెడ్డి, నీరడి లక్ష్మీ నారాయణ, సయ్యద్ సందాని, ముక్క రమేశ్, కె.రవి, బొందయ్య, యు.రాజు వివిధ మండల శాఖల అధ్యక్షులు పార్థసారథి, ఎం.రాజిరెడ్డి, ఎ. శ్రీనివాస్ రెడ్డి, వి.శ్రీనివాస్ రెడ్డి, బి రవీందర్ రెడ్డి, నర్ర రామచంద్రారెడ్డి, కూరెళ్ళ శ్రీనివాస్ రెడ్డి, పల్లె శ్రీనివాస్ గౌడ్, ఆకుల లక్ష్మణ్ వివిధ మండలాల ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు ప్రాథమిక సభ్యులు పాల్గొన్నారు.

# పల్లా రాజేశ్వర్ రెడ్డి నీ పరామర్శించిన బి ఆర్ఎస్ నాయకులు



**కొమురవెల్లి, జూన్ 22 (సిద్దిపేట పవర్)** జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ డ్డిని హైదరాబాదులోని ఆయన నివాసంలో బిఆర్ఎస్ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఇటీవల ప్రమాదవశాత్తు కాలికి గాయమై శస్త్ర చికిత్స జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్ రెడ్డి, చేర్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లేశం, మాజీ ఎంపీటీసీ మెరుగు కృష్ణ, నాయకులు వుడెం గోపాల్ రెడ్డి, అత్కూరి జయరాములు, దుర్గారెడ్డి, దయ్యాల ఆంజనేయులు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 26 నుండి పాలిసెట్ - 2025 కౌన్సెలింగ్




- పెరిగిన రెండు ప్రభుత్వ పాలిటెక్నిక్ లు
- ప్రైవేట్లో తగ్గిన రెండు పాలిటెక్నిక్ లు
- మొత్తంగా ఈసారి తగ్గిన సీట్లు 1,836

**నంగునూరు, జూన్ 22 సిద్దిపేట పవర్**

మూడు సంవత్సరాల ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం ఈనెల 26 తేదీ నుంచి 29 తేది వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. రెండు విడతల్లో కౌన్సిలింగ్ పూర్తికానుంది. ఈ మేరకు పాలిసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ ను ప్రవేశాల కన్వీనర్ దేవసేన విడుదల చేశారు. ఈ సంవత్సరం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం, సంగారెడ్డి జిల్లా పటాన్ చెరులలో రెండు ప్రభుత్వ కళాశాలలు కొత్తగా అందుబాటులోకి వచ్చాయి. దాంతో ప్రభుత్వ కళాశాలలు 57 నుంచి 59 కి పెరిగింది. అదే సమయంలో రెండు ప్రైవేట్ కళాశాలలు తగ్గిపోయాయి. వాటి సంఖ్య 57 నుంచి 55 కు పడిపోయింది. గత విద్యా సంవత్సరం(202425) మొత్తం 30,468 సీట్లు ఉండగా. అందులో 20,819(68 శాతం) భర్తీ అయ్యాయి. కొత్తగా వచ్చిన రెండు కళాశాలల్లో ఈడబ్ల్యూఎస్ కోటా కింద 42 సీట్లు కలుస్తాయి. కొత్త కళాశాలల్లో ఒక్కో దాంట్లో మూడు బ్రాంచీలలో 180 సీట్ల చొప్పున మొత్తం 360 అందుబాటులోకి రానున్నాయి. ఈసారి మొత్తం 28,632 సీట్లు ఉంటాయి. గత ఏడాదితో పోలిస్తే 1,836 సీట్లు తగ్గాయి. పాలిటెక్నిక్ లలో యాజమాన్య కోటా ఉండదు. వంద శాతం కన్వీనర్ కోటా కిందే భర్తీ చేస్తారు. జులై 30 నాటికి స్పాట్ ప్రవేశాలు కూడా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం కౌన్సెలింగ్ స్లాట్ బుకింగ్ విధానంలో జరుగుతుంది. టీజీ పాలిసెట్ 2025 ఉత్తీర్ణులైన విద్యార్థిని విద్యార్థులు ధ్రువపత్రాల పరిశీలన కోసం ఆన్ లైన్ లో స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా 32 సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశారు. సిద్దిపేట జిల్లాలో నంగునూరు మండలంలోని రాజగోపాలపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ లో హెల్ప్ లైన్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఈనెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి స్లాట్ బుక్ చేసుకోవాలి. తమకు అనుకూలమైన పాలిసెట్ హెల్ప్ లైన్ సెంటర్ ను స్లాట్ బుకింగ్ లో ఎంపిక చేసుకోవాలి. ఈ స్లాట్ బుకింగ్ కొరకు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.300లు, ఇతర విద్యార్థులు రూ.600 లు చెల్లించాల్సి ఉంటుంది.

**తీసుకు వెళ్లాల్సిన ధ్రు వపత్రాలు:**

* పాలిసెట్ - 2025 ర్యాంక్ కార్డ్.
* పాలిసెట్ - 2025 హాల్ టికెట్
* ఆధార్ కార్డు
* ఎస్.ఎస్.సి. మెమో
* 4 నుండి 10వ తరగతి కి సంబంధించిన స్టడీ సర్టిఫికెట్లు
* టీసీ ట్రాన్సఫర్ సర్టిఫికెట్
* ఆదాయ ధ్రువీకరణ పత్రం.
* కుల ధ్రువీకరణ పత్రం.
* ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రం.

**తొలి విడత కౌన్సెలింగ్ షెడ్యూల్...**

ఈనెల 24 నుంచి 28 వరకు: ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ల బుకింగ్

26-29 వరకు: ధ్రువపత్రాల పరిశీలన

26 నుంచి జులై 1 వరకు: వెబ్ ఆప్షన్ల నమోదు

జులై 4న: సీట్ల కేటాయింపు

జులై 4– 6 వరకు: వెబ్సైట్ ద్వారా ఫీజు చెల్లించి... సెల్ఫ్ రిపోర్టింగ్

**రెండో విడత కౌన్సెలింగ్ షెడ్యూల్...**

జులై 9-10 వరకు: ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ల బుకింగ్

జులై 11వ తేదీ: ధ్రువపత్రాల పరిశీలన

11–12 వరకు: వెబ్ ఆప్షన్ల నమోదు

ఆన్లైన్లో స్లాట్ బుకింగ్ చేసుకొన్న విద్యార్థిని విద్యార్థులు ఈనెల 26వ తేది నుండి 29వ తేదీ వరకు స్లాట్ బుకింగ్ లో ఎంచుకొన్న పాలిసెట్ హెల్ప్ లైన్ సెంటర్ లో కౌన్సిలింగ్ కు హాజరు కావాలి. కౌన్సిలింగ్ కు వెళ్లేటప్పుడు ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు రెండు జతల జిరాక్స్ ప్రతులు తీసుకెళ్లాలి.




# నేత్రదానం మహాదానం

**అయిత సత్యనారాయణ**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం :** నేత్ర దానం మహాదానం అని ఆర్యవైశ్య మహాసభ గజ్వేల్ పట్టణ ఉపాధ్యక్షుడు అయిత సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆర్యవైశ్య నాయకుడు కాసం శ్రీనివాస్ మాతృమూర్తి కాసం వీరమణి అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న అయిత సత్యనారాయణ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కీర్తిశేషులు కాసం వీరమణి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి అనుమతితో కంటి వైద్యుల నేతృత్వంతో నేత్రాలు సేకరించారు. ఈ సందర్భంగా అయిత సత్యనారాయణ మాట్లాడుతూ నేత్ర దానం మహాదానమని మృతి చెందిన వారి ఒకరి నేత్రాలు మరో నలుగురికి చూపు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. పుట్టిన వారికి మరణం తప్పదు అని నేత్ర దానం,అవయవ దానం మీద అందరూ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో దొంతుల సత్యనారాయణ,కొత్త శ్యాంసుందర్, ఆర్యవైశ్య నాయకులు లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


# వరుణ దేవుని రాకకోసం చిన్నారుల తపన

**రాంపూర్ లో కప్పతల్లి ఆట**

**చేర్యాల, జూన్ 22 (సిద్దిపేట పవర్)** జూన్ మొదటి వారంలో పడాల్సిన వర్షాలు పడకపోవడంతో గ్రామ దేవతలకు పూజలు చేస్తూ..వర్షాలు కురవాలి వానదేవుడా... పంటలు బాగా పండాలి వానదేవుడా అంటూ పాటలు పాడుతూ చిన్నారులు కప్పతల్లి ఆటలు ఆడారు. ఈ పూజలు చేర్యాల మండలంలోని రాంపూర్ గ్రామంలో నిర్వహించారు. చిన్నారులు అంతా కలిసి రోకలి బండను అలకరించి మధ్యలో సంచిలో కప్పను తగిలించి డబ్బు సప్పులతో గ్రామంలో ఇంటి ఇంటికి తిరుగుతూ వర్షాలు కురవాలని మహిళలు హారతి పట్టి కప్పతల్లిపై, చిన్నారులపై బిందెలతో నీళ్లు పోస్తూ వరుణుడు కరుణించాలని సాంప్రదాయ పద్ధతిగా వరుణ దేవుణ్ణి వేడుకుంటూ మొక్కులు చెల్లించుకుని భిక్షాటన చేశారు.ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ.. పాతకాలంలో వానలు కురువాలంటే పెద్దలు ఈ కప్పతల్లి ఆట ఆడేవారని వరుణుడు కనికరించి వర్షాలు కురిసేవని అన్నారు. అదే పద్ధతిని ఇప్పుడు పాటిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం కూడా సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు పండాలని వరుణ దేవుణ్ణి కోరారు. కప్పతల్లి ఆడినవారిలో బాగోతం మనోజ్,బండారి చరణ్, దొడ్డి సాయినాథ్, దొడ్డి సంజయ్, బండారి ప్రవీణ్, బొప్పనపల్లి చిన్ను తదితరులు పాల్గొన్నారు.



# అగ్రకులాల వద్దే ఇంకా అధికారం అందుకే సామాజిక అసమానతలు



బహుజన భావజాల విముక్తే ప్రత్యామ్నాయ మార్గానికి దారి BRS పందికొక్కులను తరిమి కొట్టాలన్న RS ప్రవీణ్ కుమార్ BSP కార్యకర్తలను కాల్చి మన తెలంగాణ రాష్ట్రంలో బహుజనులకు మోడ్రన్ బానిసత్వాన్ని నేర్పించాలని చూస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా దొరల పాలన,ఫోన్ టాపింగ్, ప్రాజెక్ట్ల కమిషన్లు అంటూ ప్రజల్ని చైతన్య పరుస్తున్నానన్న పేరుతో దాదాపుగా మెజారిటీ రెడ్డిలకు ప్రచారం చేసి వాళ్లకే సింహాసనం అప్పజెప్పి అమ్ముడుపోయిన మోసపూరితపు తీన్మార్ మల్లన్నను నికార్సైన BC ఉద్యమ నాయకుడిగా ప్రజలెందుకు నమ్మాలో అర్థం కావడం లేదు. ఎవరి పాలయ్యిందిరో తెలంగాణ~ ఎవడేలుతున్నాడు రో అంటూ తన స్వరంతో యావత్ తెలంగాణ ప్రజల్ని ఆకట్టుకున్న ఏపూరి సోమన్న ఎటు పోయినాడు...? ABCD వర్గీకరణ అంటూ ఏళ్ల పోరాటంతో అనేక పార్టీల మద్దతుతో చివరాఖరికి తాను అనుకున్న లక్ష్యం వైపు చేరి, గౌరవప్రదమైన పద్మశ్రీ పొంది మిగిలింది ఇంకా అంబేద్కర్ రాజ్యమేనని గుర్తించకుండా మనువాదపు బిజెపి పక్కన ప్రయాణించడం ఎంతవరకు సమంజసం. అణగారిన వర్గాలకు కూడా పదవులు ఇవ్వాలని సోయ లేకుండా విచ్చలవిడిగా రాష్ట్రాన్ని దోచుకుని తాను చేసిన లిక్కర్ స్కాం మైమరపు కొరకు ఇంకా చెప్పాలంటే తమ సొంత రాజకీయ అస్తిత్వం కొరకే దొంగ BC నినాదం (నాటకం) ఎత్తుకున్న కవితక్కని ఏమనాలో ఎవరికైనా ఆలోచన వస్తుందా..? మిగిలింది ఇంకా ఒక్కటే ఈ అగ్రకుల పార్టీలన్నీ తమ రాజకీయ అస్తిత్వం కోసం అన్ని ఒకటవుతాయా అన్నది జగమెరిగిన సత్యమే కానీ బయటకు మాత్రం పెద్ద బద్ధ శత్రువుల వల్లే నటిస్తాయి. కాబట్టి కేవలం పేదల కోసం పెట్టిన పార్టీలను ప్రజలు గుర్తిస్తే పేదలే ప్రజాప్రతినిధులు,పాలకులు అవుతారని గుర్తుంచుకోవడం మంచిది.



# బాప్టిస్ట్ సంఘం దుబ్బాక వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది

**దుబ్బాక సిద్దిపేట పవర్ న్యూస్ జూన్ 22** బాప్టిస్ట్ సంఘం దుబ్బాక వారి ఆధ్వర్యంలో ఆదివారం రోజున ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. మరియు పది రకాల టెస్టులు చేసి వెంటనే ఉచితంగా మందులు ఇవ్వడం జరిగింది.ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం కోసం పూర్తిగా సహకరించిన బాప్టిస్ట్ చర్చ్ సికింద్రాబాద్ సీనియర్ పాస్టర్ పురుషోత్తం, అధ్యక్షులు జిఎస్ కాలిస్టర్,కార్యదర్శి సన్నీ ఫ్రాన్సిన్, కోశాధికారి తొంట ఎలిషా ,కన్వీనర్ ధన కళ్యాణి పట్నాయక్,కొకన్వీనర్ విజయ్ భాస్కర్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించి విజయవంతం చేసినందుకు ఓరుగంటి రాజరత్నం ధన్యవాదాలు తెలిపారు.

# శారీరక మానసిక ఆరోగ్యం కోసం యోగా

**సిద్దిపేట పవర్:**

శారీరక మానసిక ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవర్చుకోవాలని యోగా శిక్షకులు సామాజిక కార్యకర్త బీర్కూరి మనోహర్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని సిద్దిపేట జిల్లా కేంద్రంలోని యూనియన్ గ్రామీన స్వయం ఉపాధి శిక్షణ సంస్థ UnionRSETI లో యోగ ఆసనాలు చేయించారు. అనంతరం జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శరీరం మరియు మనసును ఏకం చేయడం కోసం యోగా చేయాలని తద్వారా మనలోని నాడులు గ్రందులు ఉత్తేజితమై మన ఆరోగ్యాన్ని కాపాడతాయని అన్నారు. దీర్ఘ ఆయుషు లభిస్తుందని అన్నారు. ప్రాణాయం వల్ల అధిక ఆక్సిజన్ మన శరీరానికి అంది వ్యాధి నిరోధక శక్తి పెంపొందుతుందని అన్నారు. మంచి బుద్ధి మానసిక ప్రశాంతత అలబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు బీర్కూరి మనోహర్ ను శాలువతో, పూల మొక్కతో సంస్థ డైరెక్టర్ నాయక్, స్టాఫ్ మరియు విద్యార్థులు ఘనంగా సన్మానించారు.



# యువత ఆనందం కొరకు జీవితాలు నాశనం చేసుకోవద్దు

- గంజాయి ఇతర మత్తు పదార్థాల రహిత జిల్లాకు ప్రతి ఒక్కరూ సహకరించాలి
- మారకద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యత.
- డ్రగ్స్ మహమారిని తరిమేద్దాం డ్రగ్స్ రహిత సమాజాన్ని భావితరాలకు అందిద్దాం
- టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్.

**సిద్దిపేట పవర్:** సిద్దిపేట :యాంటీ డ్రగ్స్ అవేర్నెస్ వీక్ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం సిద్దిపేట ఓల్డ్ బస్టాండ్ వద్ద ప్రజలకు యువకులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలని తెలిపారు. యువత ఎంతో బంగారు భవిష్యత్తు కలిగి ఉండవలసిన వారు కొంతమంది చెడు మార్గాల వైపు ఆకర్షితులవుతున్నారని మత్తుకు అలవాటు పడి గంజాయి అలవాటు చేసుకుని జీవితాలు నాశనం చేసుకుంటున్నారని వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలు సేవించే వారు వారి మానసిక స్థితిని కోల్పోయి నేరాలు చేసే అవకాశం ఉంటుందన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు మానవుల ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపుతాయని నరాలు గుండె సహా ప్రధాన అవయవాలు దెబ్బతినే అవకాశం ఉన్నదని తెలిపారు. గ్రామాలలో పట్టణాలలో మారకద్రవ్యాల విషయములో మారకద్రవ్యాలకు యువతను దూరంగా ఉంచాలని డ్రగ్ రహిత తెలంగాణ సమాజం కొరకు అందరూ కృషి చేయాలని సూచించారు.

